శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

- 8న జరుగనున్న శివపార్వతుల కల్యాణం
- దర్శించుకోనున్న వేలాదిమంది భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

ఎల్కతుర్తి : మండలంలోని సూరారం గ్రామశివారు లో ఉన్న సింగరాయ విశ్వేశ్వరాలయం మహాశివ రాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈనెల 8న శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరుగనుంది. కాగా ఈ ఆలయం కాకతీయుల కాలం నాటిదని, సుమారు వెయ్యి సంవత్సరాల పురాతన చరిత్ర ఉందని గ్రామస్తులు తెలిపారు. ఈ ఆలయం చుట్టూ పచ్చని పొలాలు ఉండడంతో ఆహ్లాదంగా కనిపిస్తోంది. ఈ ఆలయం శిథిలావస్థలో ఉండగా ఆలయ కమిటీ సభ్యులు మరమ్మతులు నిర్వహించి సింగరాయ విశ్వేశ్వరున్ని పునఃప్రతిష్ఠాపన చేశారు. అప్పటి నుంచి భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా నిలువడంతోపాటు సంతాన విశ్వేశ్వ రాలయంగా పేరుగాంచింది. ఇక్కడి ఆలయ సింహ ద్వారం దక్షిణం వైపు ఉండడంతో ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రముఖ ఆలయాల్లోకల్లా ఇదొకటిగా ఈ ప్రాంత భక్తులు భావిస్తారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న దీప ధ్వజస్తంభం ఆగ్నేయ దిశలో 50మీటర్ల ఎత్తుతో ఉంటుంది. గర్భగుడికి ఎదురుగా మండపం, ముందు పురాతన బావి ఉంటుంది. ఈ బావిలోని నీరు అన్ని సమయాల్లో స్వచ్ఛతగా చెతికందేంత ఎత్తులో ఉంటాయి. ప్రతీ సంవత్సరం మహాశివరాత్రి రోజు అంగరంగ వైభవంగా జరిగే శివపార్వతుల కల్యాణంను తిలకించేందుకు చుట్టు పక్కల 19 గ్రామాల ప్రజలే కాకుండా హైదరాబాద్, సోలాపూర్, ఏటూర్‌నాగారం నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో హాజరై వీక్షిస్తారు. మహా విశిష్టత కలిగిన సింగరాయ విశ్వేశ్వరాలయంలో నిత్యం ధూపదీప నైవేద్య పూజలు నిర్వహిస్తుంటారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి తర్వాత భక్తుల కోరిన కోర్కెలు తీర్చి కొంగుబంగారంగా నిలుస్తున్న ఆదిదేవుడైన ఈ సింగరాయ విశ్వేశ్వరుడేనని ఇక్కడి ప్రజలు భావిస్తారు.

8న పత్యేక పూజా కార్యక్రమాలు..

ఈనెల 08 (శుక్రవారం) మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలు ఉదయం 5గంటలకు ధ్వజారోహనం, అనంతరం స్వస్తిపుణ్యాహ వచనం, గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, పంటపారాధన, శివునికి మహా రుద్రాభిషేకం, అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవం, అర్చనలు, అభిషేకాలు, భద్రకాళి పూజ, వీరభద్ర ఆవాహనపూజ, లింగోద్భవ మహాభిషేకం, రాత్రి 1గంటకు అగ్ని ప్రజ్వలన, 9(శనివారం) రోజున ఉదయం 5.15 నిమిషాలకు అగ్నిగుండాల ప్రవేశం, 6.15 మహా ఆశీర్వచనం, స్వస్తి కార్యక్రమాలతో ముగుస్తాయని సిద్ధాంతి గణేశ్‌శర్మ వివరించారు. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొననున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఎల్కతుర్తి : ఆలయం ఆవరణలో నవగ్రహాలు



ఎల్కతుర్తి : కొలువైన సింగరాయ విశ్వేశ్వర లింగం

ఆరు గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలు

శివరాత్రి పర్వదినం రోజు మండలంలోని ఆరు గ్రామాల్లో శివరాత్రి వేడుకలు కనుల పండువగా జరుగనున్నాయి. సూరారం విశ్వేశ్వరాలయంతో పాటు దండేపల్లి సాంబశివకేశవాలయంలో, ఎలకతుర్తి వీరభద్రస్వామి శివాలయం, దామెరలోని శివాలయం, గోపాల్‌పూర్‌లోని శివాలయం, కేశవాపూర్‌లోని రామాలయంలో ప్రతీ సంవత్సరం శివరాత్రి పండుగను ఆయా ఆలయల కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహిస్తారు. పోలీస్ సిబ్బంది సైతం బందోబస్తు నిర్వహిస్తారు. అలాగే భీమదేవరపల్లి మండలం ముత్తారం పురాతన త్రికుటేశ్వరాలయంలో వేడులకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఎల్కతుర్తి : సింగరాయ ఆలయంలో ఆగ్నేయ దిశలో ధ్వజస్తంభం

ఐనవోలు మల్లన్న ఆలయంలో బ్రహ్మోత్సవాలు



ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమయ్యి ఆదివారం వరకు కొనసాగనున్నాయి. ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా శ్రీ భ్రమరాంభికా మల్లిఖార్జున స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

బ్రహోత్సవాల షెడ్యూల్

6న ఉదయం 8 గంటలకు సూర్య ప్రభ వాహన సేవ, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, దీక్షాధారణ, అఖండ దీప స్థాపన, సాయంత్రం మృత్ సంగ్రహణ, అంకురార్పణ, అగ్ని మదన–అగ్ని ప్రతిష్ఠాపన, ద్వజారోహణ బలిహరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి చంద్ర ప్రభ వాహనసేవ జరుగనుంది. మార్చి 7న ఉదయం అశ్వ వాహనసేవ, రాత్రి శేషవాహన సేవ తోపాటు గవ్యాంత పూజలు, వాస్తు పూజ, పర్యగ్నికరణ రుద్ర హోమం, ప్రాతరౌపాసన, అష్టోత్తర శత(108) కళశార్చన, మహాన్యాసరుద్రం లాంటి కార్యక్రమాలు ఉంటాయి. 8న మహాశివరాత్రి, ఉదయం సింహ వాహన సేవ, రాత్రి నంది వాహనసేవతో పాటు అర్ధరాత్రి లింగోధ్భవ కాలంలో అష్టోత్తర శత(108) కళశలచే విశేష మహాభిషేకం, పెద్దపట్నం, భ్రమరాంభిక మల్లికార్జునస్వామి కల్యాణం విశేషంగా నిర్వహిస్తారు. 9న ఉదయం రావణ వాహన సేవ, సాయంత్రం రథోత్సవం పురవీధి సేవ, రథాంగ హోమం నిర్వహిస్తారు. 10న ఉదయం పర్వతవాహన సేవ, గవ్యాంత పూజలు, రుద్ర, చండి హోమం, మృగయాత్ర, ధ్వజ అవరోహణ, నిత్యోపాసన, బలిహరణ, పూర్ణాహుతి, చూర్ణోత్సవం, వసంతోత్సవం, త్రిశూల స్నానం, అవబృదుతో పాటు రాత్రికి పవళింపు సేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవ, పండిత ఆశీర్వచనం, పండిత సన్మానాది కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ప్రధాన అర్చకుడు తెలిపారు. వాహన సేవలలో పాల్గొనే వారు దేవస్థాన కార్యాలయంలో రూ.516లు చెల్లించి రశీదు పొందాలని ఆలయ ఈఓ నాగేశ్వర్ రావు తెలిపారు.

‘ఎస్సైని మాట్లాడుతున్నానంటే నమ్మొద్దు’

ఐనవోలు : తాను ఐనవోలు ఎస్సై అని చెబుతూ ఓ అపరిచిత వ్యక్తి ఫోన్లు చేస్తున్నాడని, అలాంటి ఫోన్‌కు మండల ప్రజలు స్పందించొద్దని ఎస్సై గైకడి అనిల్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8333934077 ఫోన్ నంబర్ నుంచి కాల్ చేసి ఎస్సై అని చెప్పి డబ్బులు అడుగుతున్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. ఆ నంబర్ నుంచి ఫోన్ వస్తే స్పందించొద్దని, డబ్బులు పంపించొద్దని ఆయన కోరారు. ప్రస్తుతం ఐనవోలు ఎస్సై నంబర్ 8712685244 అని తెలిపారు. సైబర్ నేరాలకు గురిఅయిన బాధితులు టోల్ ఫ్రీ నంబర్ 1930ను సంప్రదించాలని కోరారు. అపరిచిత వ్యక్తులు ఫోన్లు చేసి ఓటీపీ, ఇతర వివరాలు అడిగితే స్పందించొద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు.

7న సర్వసభ్య సమావేశం

పరకాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ టి.స్వర్ణలత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం 11గంటలకు జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

విద్యతోనే జీవితంలో ఉన్నతి

వర్ధన్నపేట : చదువుకోవడం ద్వారానే జీవితంలో ఉన్నతి సాధించగలరని ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ తెలిపారు. పట్టణంలోని ఆల్ఫోర్స్ ఇ–టెక్నో' స్కూల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా అప్పారావు, అరుణ ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేలా క్రమశిక్షణ కూడినతో విద్యాబోధన అందించాలని సూచించారు. విద్యార్థులకు కళలపై అవగాహన పెంచాలని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రదర్శించిన 'చిన్ని చిన్ని ఆశ..', 'ఛలో..ఛలో వచ్చిందమ్మా...ఆనందం తెచ్చిందమ్మా', 'స్నేహితుడా...ఓ స్నేహితుడా', 'ఓయ్ బాటసారి...చూద్దామా' ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా

సీఐ, ఎస్సైకి సన్మానం



చెన్నారావుపేట : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరిన సందర్భంగా సీఐ చంద్రమోహన్, ఎస్సై అరుణ్‌కుమార్‌లను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలోని బృందం, బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లపెల్లి నర్సయ్యగౌడ్, రమేశ్, రాజేందర్, రాజు, అశోక్, ఓదేలు, కుమారస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా శేఖర్‌రావు



వర్ధన్నపేట: కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధిగా వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావును నియమించినట్లు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 35 ఏళ్లుగా పార్టీలో సేవలు అందిస్తున్న క్రమంలోనే పదవిని కట్టబెట్టినట్టు పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి శేఖర్‌రావు సేవలు మరింత అవసరమని భావిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా శేఖర్‌రావు మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి పాటుపడతానని తెలిపారు. తనకు పదవి కట్టబెట్టిన ఎమ్మెల్యే నాగరాజుకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

నెక్కొండ : నేడు (బుధవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

నేడు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి..

రాయపర్తి : నేడు (బుధవారం) మండల కేంద్రంలోని కుందూరు కృష్ణారెడ్డి దొడ్డిలో బీఆర్‌ఎస్ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్ తెలిపారు. మండల కేంద్రంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. సమావేశానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రేపు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా

గీసుకొండ : వరంగల్ నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట రేపు (ఈనెల 7న) ఉదయం 10 గంటలకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా నిర్వహిస్తామని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నర్సింహ, రామా రాజేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఇతర అనేక సమస్యలు పరిష్కరించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, పీఆర్సీ, ఏరియర్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

‘వయో పరిమితి పెంచాలి’

వర్ధన్నపేట : మెగా డీఎస్సీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అభ్యర్థులకు వయో పరిమితిని మరో మూడేళ్లు పెంచాలని సామాజిక కార్యకర్త బంక మాణిక్యం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వయో పరిమితి 46 ఏళ్లుగా కాగా ప్రభుత్వం ఐదేళ్లు పెంచి 56 ఏళ్లు చేసిందని పేర్కొన్నారు. వేలాది మంది నిరుద్యోగ యువత అనేక ఏళ్లుగా ఎమ్మెస్సీ, ఎంఈడీ, బీఈడీ పూర్తి చేసినా వయస్సుతో అవకాశాలు చేజారిపోయాయని తెలిపారు. మరో మూడేళ్లు పెంచి నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

‘పూసపల్లి కుట్ర కేసు ఎత్తివేయాలి’

వర్ధన్నపేట : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, వరంగల్ జిల్లా కార్యదర్శి గోపన్న, జిల్లా నాయకులు ఎస్కే.మదార్, సురేశ్‌లపై బనాయించిన పూజపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామిక పాలన చేస్తామని వాగ్దానం చేసినా అందుకు భిన్నంగా ఫిబ్రవరి 14న పార్టీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు మొగిలి ప్రతాపరెడ్డి, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్‌తోపాటు మొత్తం 24 మందిపై అక్రమంగా కేసు బనాయించారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలి

- డీఆర్డీఓ నాగపద్మజ

వేలేరు : మండలంలోని వివిధ నర్సరీల్లో గల మొక్కలను సంరక్షించాలని డీఆర్డీఓ నాగపద్మజ అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్షేత్ర తనిఖీల్లో భాగంగా మంగళవారం మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలోని నర్సరీని ఆమె సందర్శించారు. వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన షెడ్‌నెట్, నర్సరీలో మొక్కల జర్మినేషన్, నర్సరీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. నర్సరీ మేనేజ్‌మెంట్ సరిగానే పనిచేస్తుందని సంతృప్తి చెందారు. ఖాళీ బ్యాగుల్లో, ప్రైమరీ బెడ్లలో పెంచిన మొక్కలను నాటాలని అన్నారు. నర్సరీలో 75 శాతం మొక్కల జర్మినేషన్ ఉందని తెలిపారు. అలాగే ఉపాధిహామీ పనిప్రాంతాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, ఈసీ ఇన్‌చార్జ్ ప్రదీప్, టీఏ నాగరాణి, ఎఫ్‌ఏ మల్లన్న పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీఓ నాగపద్మజ

కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు



బహుమతులు సాధించిన విద్యార్థినులు

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాలలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. కియోజపాన్‌షోటోకాన్ కరాటే అసోసియేషన్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ 2024 పోటీలు ఇటీవల వరంగల్‌లోని మండిబజార్లో నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాగా పెద్దపెండ్యాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. పి.లక్ష్మి, ఎస్. దీపిక గోల్డ్ మెడల్ సాధించగా, ఎం.సింధూజ సిల్వర్ మెడల్, జి సహస్ర, వర్షిత బ్రాంజ్ మెడల్, స్పారింగ్ విజేత సీహెచ్ శ్వేత గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ మేరకు విద్యార్థినులను పాఠశాల హెచ్ఎం బత్తిని రాజేందర్, కరాటే మాస్టర్ కిశోర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, అరుణ, నరహరి, అంజయ్య, రఫియాభాను, కరుణ, మల్లికార్జున్, రాజన్న, లక్ష్మారెడ్డి, సుధాకర్, శ్రీనాథ్, రాజన్‌బాబు తదితరులు అభినందించారు.

భ్రూణహత్యలను నిర్మూలించాలి : సీడీపీఓ

దామెర : భ్రూణహత్యల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ భాగ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బేటీ బచావో బేటీ పడావో, సఖీసెంటర్, భ్రూణ హత్యల నిర్మూలన, టోల్‌ఫ్రీ నంబర్ 181, మహిళలకు సంబంధించిన రక్ష, ఉపాధి, విద్య, కౌన్సెలింగ్, న్యాయ సాయంతో పాటు వివిధ రకాల సమస్యలు, వాటి పరిష్కారాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాణి, మంజుల, జిల్లా సాధికారత మిషన్ లావణ్య, ఏపీఓ శారద, జెడ్పీటీసీ కల్పనాకృష్ణమూర్తి, ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిరాలి, ఎంపీటీసీ రామకృష్ణ, సోషల్ వర్కర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

హక్కుల సాధనకు కృషి చేయాలి

- ఎంపీపీ జక్కుల అనితారమేష్

ఎల్కతుర్తి : మహిళలు తమ హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని ఎంపీపీ జక్కుల అనితాతరమేష్ పిలుపునిచ్చారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో సీడీపీఓ స్వరూప ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళా సాధికారత సాధించాలని ఆకాంక్షించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం మరింత బలోపేతం అవుతుందన్నారు. ప్రతీ మహిళా స్వయం ఉపాధిని సృష్టించుకొని కుటుంబానికి అండగా నిలవాలన్నారు. మహిళా హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అంగవాడీ కార్యకర్తలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రమాదేవి, కల్యాణి, సునీత, సుశీల, తేజశ్రీ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలను శాలువాతో సన్మానిస్తున్న ఎంపీపీ

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్

దామెర : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ నారాయణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణి పెండింగ్ ఫైళ్లను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, డీటీ యూసుఫ్ ఖురేషి, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఎల్లమ్మ జమదగ్ని’ పెళ్లికి హాజరైన ఎమ్మెల్యే



డోలువాయిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్ : మండలంలోని జానకిపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఎల్లమ్మ జమదగ్ని వివాహానికి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పూజారులు డోలువాయిద్యాలతో, అమ్మవారి బోనాలతో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి డోలువాయిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

డాక్యుమెంటరీ ఆవిష్కరణ

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరిస్వామి ఆలయ చరిత్రపై తీసిన డాక్యుమెంటరీని మంగళవారం తహసీల్దార్ సుభాషిణి మంగళవారం విడుదల చేశారు. గ్రామానికి చెందిన ఆర్సిని ట్యూబర్ చేరాల రాకేష్ కాకతీయుల కాలంలో నిర్మించిన ఆరు శతాబ్దాల చరిత్ర గలిగిన శ్రీమత్స్యగిరిస్వామి చరిత్రను కళ్లకు కట్టినట్లుగా డాక్యుమెంటరీని రూపొందించి తహసీల్దార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె రాకేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



శాయంపేట : మండలంలోని అర్హులందరూ ఓటురుగా నమోదు చేసుకోవాలని ఎంపీఓ రంజిత్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా గ్రూపు మహిళలు, ఐకేపీ సిబ్బంది, మల్టీపర్పస్ సిబ్బంది ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏపీఎం శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఓటరు ఆవశ్యకత గురించి వివరించారు. 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధమని, అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకొని ఓటుహక్కు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి మడికొండ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంకరరోడ్డుతో ప్రయాణికుల కష్టాలు

శాయంపేట : మండలంలోని రాజుపల్లి గ్రామం నుంచి ముత్యాలమ్మకుంట, సాధోనిపల్లి మీదుగా సూర్యనాయక్‌తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం గిరిజన అభివృద్ధి సంస్థ ఎస్‌టీఎస్‌డీఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేసింది. 2018 సంవత్సవంలో అప్పటి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పనులను ప్రారంభించారు. అయితే ఆ సమయంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. బీటీ రోడ్డు నిర్మాణానికి కంకరపోసి వదిలేశారు. వివిధ గ్రామాల ప్రజలు మల్లంపల్లికి రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఈ క్రమంలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డుపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కంకరపోసి అసంపూర్తిగా వదిలేసినరోడ్డు

దళితుల సమస్యలపై నిరంతరం పోరాడాలి

- అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రకాశ్

ఎల్కతుర్తి : సమస్యల పరిష్కారానికి దళితులు పోరాడాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ అన్నారు. భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో మంగళవారం అంబేడ్కర్ సంఘం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా నాగిల్ల సారయ్య, ఉపాధ్యక్షుడిగా యాదగిరి, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారులుగా లింగయ్య, ప్రశాంత్, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, రజినీకాంత్, కుమార్, విక్రమ్, సన్ని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ సంఘాలు దళిత, బహుజనుల హక్కుల కోసం, పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. సమాజంలో జరిగే సంఘటనలు, సమస్యలపై స్పందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలువాలని సూచించారు. అంబేడ్కర్ సంఘం నాయకులు సామాజిక సేవలో ముందుంటూ స్ఫూర్తిగా నిలవాలని, అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని సూచించారు. సామాజంలో దళితులకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేసేందుకు కలిసికట్టుగా ముదుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కోకన్వీనర్లు రవీందర్, ప్రేమ్‌రాజ్, మాడుగుల సంపత్, వెంకటస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెప్యాల ప్రకాశ్

గుడుంబా విక్రయిస్తే కేసులు : సీఐ



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు : గ్రామాల్లో గుడుంబా తయారీ చేసినా, విక్రయించినా చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని సీఐ సంతోష్ అన్నారు. మండలంలోని పెంచికలపేట శివారులో గుడుంబా స్థావరాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1200 లీటర్ల గుడుంబా పానకాన్ని ధ్వంసం చేసి 46లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన ఇస్లావత్ సుకాంత్, ఇస్లావత్ కల్పనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా గుడుంబా తయారీ చేసినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.